# రావి ఆకు

సమాజములో వైద్య విధానమును తెల్పునది నాగుల చవితి. నాగులు అనగా నాగుపాములని అర్థము. చవితి అనగా నాలుగు అని అర్థము. పక్షములో వచ్చు చవితి జ్యోతిష్యశాస్త్రరీత్యా సమాజమునకు సంబంధించిన సమాచారమును తెలియజేయునది. అందువలన నాగుపాముల వైద్యమునకు సంబంధించిన సమాచారమును అందరు గుర్తుచేసుకొనునట్లు శ్రావణమాస శుక్లపక్షములో వచ్చు చవితి దినమును ఎన్నుకొని నాగుల చవితి అన్నారు. నాగులచవితిని ప్రస్తుతకాలములో దేశములోని ప్రజలందరు ఒక పండుగగ చేసుకోవడము ఆనవాయితీ అయినది. నాగుల చవితి మొదట ఎలా తయారైనది. తర్వాత ఎలా మారినదని విచారించిన ఎడల మనకు తెలియని ఎన్నో విషయములు తెలియుచున్నవి. అవి ఏవనగా! పూర్వము వైద్యమును తెలిసినవారు అరుదుగా ఉండెడివారు. ఆ వైద్య విధానమును నేర్చే దానికి కొందరు వైద్యునివద్ద శిష్యులుగా చేరి కొన్ని సంవత్సరములు వైద్యమును నేర్చుకొనెడివారు. వైద్యుడు తనవద్దనున్న వైద్య విధానమును అనుభవముగా అర్థమగునట్లు తన విద్యార్థులకు నేర్పెడి వాడు. ఆ కాలములో వైద్య గురువు అనియు, వైద్య శిష్యులు అనియు ఈ విధముగా ఉండెడివారు. ఆ కాలములో వైద్య గురువులవద్ద ఒక స్వార్థ బుద్ధి ఉండెడిది. తనవద్దనున్న విద్యనంతటిని శిష్యులకు నేర్పితే తనంతటి వారై పోతారనీ, అలా తనతో సమానము కాకుండుటకు పూర్తి విద్యను నేర్పెడివారు కాదు. ఉదాహరణకు వైద్యునివద్ద 100 రోగములకు వైద్య ముందనుకొందాము. వైద్యుడు 99 రోగములకు మాత్రము వైద్యవిధానమును తెల్పి, ఒకదానిని మాత్రము తెలుపకుండును. ఆ విషయము శిష్యులకు కూడ తెలుసు, అప్పటి పద్ధతి అది. గురువుగారికి ఆయుస్సు అయిపోయి అవసానదశ వచ్చినపుడు శిష్యులందరు గురువుచెంతయుండి తమకు తెలియని ఒక్క వైద్యవిధానము కొరకు కాచుకొనియుందురు. అలా అవసాన కాలములో తనవద్ద శిష్యులుండుటకు కూడ గురువు ఆ విధముగా ఒక వైద్యరహస్యమును అంతవరకు చెప్పకయుండునేమో అనిపిస్తుంది. ఏది ఏమైనా తనవద్దనున్న రహస్యమును చివరికాలములో తన శిష్యులకు చెప్పి గురువుగారు చనిపోవుట జరుగుచుండెను.

గురువుగారికి ఆయుస్సు అయిపోయి అవసానకాలము వచ్చినపుడు గానీ, గురువుగారు అనారోగ్యముతో మంచము పట్టినపుడుగానీ, గురువు గారు చనిపోవునేమోనని శిష్యులు ఆయన దగ్గర చేరెడివారు, గురువువద్ద మిగిలిన రహస్యమును చివరిలో చెప్పించుకొనెడివారు. అలాకాకుండ కొందరు గురువులు అకస్మాత్తుగా చనిపోయినపుడు, అకాలమరణము ఏర్పడినపుడు గురువు తనవద్దనున్న వైద్య రహస్యమును శిష్యులకు చెప్పెడి అవకాశము లేకుండును. అలా ఒక వైద్యగురువు చనిపోతే అతనికి తెలిసిన వైద్యరహస్యము ఒకటి ఎవరికి తెలియకుండ అతనితో పాటు కాలగర్భములో కలిసి పోయెడిది. అట్లు ఎందరో గురువులు చనిపోయినపుడు ఎన్నో వైద్య రహస్యములు భూమిమీద తెలియకుండ పోయినవి. ఇట్లు కొన్ని వేల సంవత్సరముల కాలములో ఎన్నో వైద్య రహస్యములు తెలియకుండ పోయి సమాజము నష్టపోయినది. దీనినంతటిని గ్రహించిన కొంతమంది పెద్దలు యోచించి, వైద్యములో అతి ముఖ్యమైన రహస్యము ఏదైన ఉంటే అది మరుగునపడి తెలియకుండ పోవుటకు అవకాశము లేకుండ, ఆ విషయమును స్థిరస్థాయిగా అందరికి తెలియునట్లు చేయాలనుకొన్నారు. అతి ప్రమాదకరమైన, వైద్యము వెంటనే అవసరమైన రోగమేదైనా ఉన్నదాయని యోచించారు. అన్నిటిని విశ్లేషించి చూడగా చివరకు అన్నిటికంటే కాలవ్యవధి కూడ తక్కువ ఉన్నదీ, ప్రమాదకరమైనది పాముకాటు. పాము వలన విషగ్రస్థుడైన వానికి వైద్యము అత్యవసరము. పాముకాటు వలన పదిహేను నిమిషములనుండి గంటలోపల

మనిషి చనిపోవు అవకాశమున్నది. అంతలోపల వైద్యము అందకపోతే ప్రమాదము. కావున పాముకాటును అతి ప్రమాదకరమైనదని నిర్ధారించి, దానికి అత్యవసరమైన వైద్యము అవసరము అని పెద్దలు నిర్ధారణ చేశారు. పాముకాటుకు సంబంధించిన వైద్యము మరుగున పడి తెలియకుండ పోవుటకు అవకాశము లేకుండ చేయాలను కొన్నారు. పాముకాటుకు వైద్యమును, వైద్యులలో రహస్యముగా పెట్టుకోకూడదనీ, గురువుగానున్నవారు ఏ వైద్యమును రహస్యముగా పెట్టుకొనినా, పాముకాటు వైద్యమును మాత్రము రహస్యముగా పెట్టుకోక శిష్యులకు చెప్పవలెనని నిర్ధారించుకొన్నారు. అయినప్పటికీ కొందరు గురువులు మొదటివలె ప్రవర్తిస్తూ పాము వైద్యమును శిష్యులకు చెప్పెడివారు కాదు. కొంతకాలము తర్వాత పాముకాటుకు వైద్యమును వైద్యగురువులు వారి శిష్యులకు చెప్పడము లేదని గ్రహించిన వైద్య సంఘము యొక్క పెద్దలు, పాముకాటుకు చికిత్స వైద్యమును నేర్చుకొను వారికే కాక దేశములోని ప్రజలందరికి తెలియజేయాలనుకొన్నారు. ఆ కాలములోనే కాకుండ రాబోవు కాలములో కూడ ఆ వైద్య విధానము అందరికి తెలియునట్లు, పాముకాటుకు చికిత్స ఎప్పటికి రహస్యముకానట్లు చేయాలనుకొన్నారు. ఆ విషయము శాశ్వితముగా ప్రతి ఊరిలోను ప్రజలకు తెలియునట్లు చేయాలనుకొన్నారు.

పాములు మొత్తము 80 జాతులు గలవు. ఆ ఎనభై జాతులలో కేవలము ఎనిమిది జాతుల పాములకు మాత్రమే వెంటనే చంపెడి విషముండును. మిగిలిన డెబ్బయి రెండు జాతులలో ఏడు జాతులు నిదానమైన విషము కల్గియుండును. వాటి వలన కొన్ని రోగములు వచ్చి ఐదు సంవత్సరములకు చనిపోవుదురు. తొందరగా విషము పని చేయు 8 జాతులూ, నిదానముగా పనిచేయు 7 జాతులు పోగా మిగిలిన 65 జాతుల పాములకు విషముండదు. విషమున్న పాములలో నాగుపాము జాతి ఒకటి, ఒక్క నాగుపాము జాతిలోనే 11 రకముల పాములు గలవు. తెల్లనాగుపాము, నల్లనాగుపాము, గోధుమవన్నెనాగు, మిన్నాగు, నాగరాజు (కింగ్‌కోబ్ర) శివనాగు, విష్ణునాగు, బ్రహ్మనాగు, వినాయక నాగు, రక్తవన్నెనాగు, చిత్రవన్నె నాగు అనునవి పదకొండు రకములున్నవి. ప్రతి రకము నాగుపాములలోను ఆడ, మగ జాతి ఉండును. కొందరు నాగుపాము ఆడది అనియూ జెర్రిపోతు మగదనియు అనుకొనుచుందురు. అట్లనుకోవడము తప్పు. నాగుపాములలోనే ఆడ మగ రెండు రకములుండును. నాగుపాము 11 జాతులు పడగ విప్పగలవు. అందులో పడగను బట్టి ఆడపామును మగపామును సులభముగా గుర్తించవచ్చును. ఆడపాము పడగ రెండు ప్రక్కల సమానముగా ఉండదు. ఒకప్రక్క అదియు ఎడమప్రక్క పడగ సైజు కొద్దిగ తక్కువ ఉండును. మగపాము పడగ రెండుప్రక్కల సమానముగా ఉంటూ గుండ్రముగా పెద్దదిగా కనిపించును. నాగుపాములలో ఆడపామును త్రాచుపాము అనియూ, మగపామును కోడెనాగు అనియు పూర్వము అనెడివారు. ఇప్పటికాలములో చాలామందికి నాగుపాములలో ఆడ,మగ పాములున్నట్లు తెలియదు.

విషమున్న మిగత జాతుల పాములకంటే నాగుపాము జాతికే మనిషిని తొందరగ చంపు విష ప్రభావమున్నది. అందువలన పూర్వపు వైద్యపండితులు నాగుపాము విషమునకు విరుగుడు వైద్యమును చెప్పితే అన్ని జాతుల పాము వైద్యము చెప్పినట్లేనని తలచారు. పూర్వము ఎక్కువగా ప్రకృతి సిద్ధమైన మూలికావైద్యముండెడిది. పాము విషమునకు విరుగుడైన మూలికలను ప్రతి ఊరులోను పెంచవలెనని వారు నిర్ణయించుకొన్నారు. ఆ పథకములోని భాగముగానే ప్రతి ఊరులోను మొదట వేపచెట్టును, దాని ప్రక్కననే రావి చెట్టును నాటారు. వాటి ముందర నాగుపాముల ప్రతిమలను ఉంచారు. పూర్వము ప్రతి ఊరులోను వేప, రావిచెట్టులు ఒకచోట ఉండడమూ, అక్కడ చాలామంది విశ్రాంతి తీసుకొనునట్లు విశాలమైన అరుగునుంచడమూ, ఆ అరుగు మీద చెట్ల మొదటిలోనే

ముందర నాగప్రతిమలుంచడము జరిగెడిది. ఆ విధముగా నిర్మింపబడిన దానిని నాగులకట్ట అనెడివారు. ఇప్పటికీ కొన్ని ఊర్లలో రావి, వేప చెట్లున్న నాగుల కట్టలు కనిపించును. ఈ మధ్యకాలములో తయారైన కొన్ని ఊర్లలో నాగులకట్టలు లేవు. నాగులకట్టలు కొన్ని ఊర్లలో ఎందుకు లేవో తర్వాత తెలుసుకొందాము.

పాము కరిచి విషము ఎక్కితే అనగా తలకు ఎక్కితే మొదట నాలుకకు రుచి తెలియకుండ పోవును. నాలుక తెలుసుకొను ఆరు రుచులలో మొదట చేదు తెలియకుండపోవును. అటువంటి పరిస్థితిని తెలుసుకొనుటకు చేదు రుచిగల వేపచెట్టును నాగులకట్టలో ఉంచారు. విషము తలకెక్కిన తర్వాత దానిని సులభముగా తీసివేయుటకు సాధ్యమగును. అందువలన పాముకరచిన వ్యక్తిని, విషము తలకు ఎక్కిందా లేదా అని చూచుటకు వేప ఆకును నమిలించెదరు. విషము ఎక్కినపుడు చేదు తెలియకుండ పోవుట వలన అపుడు తలనుండి విషమును తీసివేయుటకు ప్రయత్నించవచ్చును. వేప ఆకుల ద్వార విషమును తెలుసుకొన్నవారు దానిని తీసివేయుటకు రావి ఆకులను వాడుకొందురు. రావి ఆకుల కాడలను విషమున్నవానికి చెవులలో పెట్టితే రావి ఆకులు తమ కాడల ద్వారా తలలోని విషమును ఆకులోనికి లాగుకొనును. ఆ విధముగ రెండు లేక మూడు జతల ఆకులతో పూర్తి విషమును తీసి వేయవచ్చును. తర్వాత వేప ఆకును నమిలిస్తే అది చేదుగా ఉండుట వలన విషము దిగిపోయినదని తెలుసుకోవచ్చును. విషమును లాగుకొను రావిఆకు పాము పడగవలె ఉండడము, క్రింద ఆకుకొన పాముతోకలాగ ఉండడమును గమనించవచ్చును. దీనిని బట్టి ప్రతి ఆకు ఒక పాముతో సమానమనీ, పాము విషమును పామేలాగుకొన్నట్లు, రావిఆకు విషమును లాగుకొనుచున్నదని తెలియుచున్నది. ఈ వైద్య విధానము అందరికి తెలియునట్లు పూర్వము ప్రతి ఊరిలోను రావి, వేపచెట్లను పెంచి కట్టకట్టియుంచారు. అదే చెట్లక్రింద నాగుపాము ప్రతిమలను కూడ పెట్టుటకు కారణమేమనగా! ఈ పాములు కరిస్తే ఈ చెట్ల ఆకులే వైద్యమన్నట్లు చెట్లక్రిందనే ముందరే పాము బొమ్మలనుంచారు. 'ప్రతి ఆకు ఔషధమని' నానుడి గలదు. రావి, వేప ఆకు దేనికి ఔషధమని ప్రశ్నవస్తే వెంటనే పాములకు అని తెలియునట్లు ఆ చెట్లక్రింద పాముల ప్రతిమలనుంచారు. ప్రతి ఊరులోను ఆ విధముగా ఉంటే అందరికీ ఆ వైద్యము తెలిసి అందరు పాముకాటునుండి బయటపడగలరని ఆనాటి పెద్దలు తలచారు.

ప్రస్థుత కాలములో ఆనాటి పెద్దల ఉద్ధేశ్యము తెలియకుండ పోయినది. ఇప్పటికీ కొన్ని ఊర్లలో నాగులకట్టలు, రావి, వేపచెట్ల సమేతముగా ఉండినప్పటికీ అవి వైద్య విధానముగా పెట్టినవనీ, రావి, వేప పాము విషమునకు మంచి ఔషధములని ఎవరికీ తెలియదు. విషమునకు ప్రతీకగా పాము బొమ్మలనూ, ఔషధమునకు ప్రతీకగా రావి, వేప చెట్లనుంచితే ఆ భావము కాలగర్భములో కలిసిపోయినది. పాము ప్రతిమలు నాగదేవతలుగా, వేప, రావిచెట్లను లక్ష్మీనారాయణులుగా భావించి ప్రజలు పూజలు చేయుచున్నారు. ఈ విధముగా వైద్యము భక్తిగా మారిపోయినది. పాము ప్రతిమలకు, రావి, వేపచెట్లు నీడ నిమిత్తమే ఉన్నాయనుకొన్న ప్రజలు ప్రతిమలను చెట్లక్రింద లేకుండ గుడులలో ప్రతిష్ఠించను మొదలు పెట్టారు. అందువలన నాగప్రతిమలు ఇప్పటి కాలములో గుడులలో కనిపిస్తున్నవి. గ్రామాల్లో రావి, వేపచెట్లు జతగా ఉండడము కనిపించకుండ పోవుచున్నవి. ఇవి ప్రాణము తీసే పాములని పాము ప్రతిమలనూ, ఇవి ప్రాణము పోసే చెట్లని రావి,వేపచెట్లను అందరికీ తెలియునట్లు పూర్వము ఎంతో పథకముగా వైద్యపండితులుంచితే ప్రాణముతీసే పాములు దేవతల స్థానములో ఉన్నాయి. ప్రాణము పోసే ఔషధచెట్లు అదృశ్యస్థానములో ఉన్నాయి. పాములను గురించి ఔషధవృక్షములను గురించి చర్చావేదికలు నాగులకట్టల మీదనే పెట్టి ప్రజలకు తెలియజేయుటకు నాగులచవితి అను పేరుతో శ్రావణమాస

శుక్లపక్ష చవితిని పూర్వము నిర్ణయించారు. మొదట వైద్యపండితులు పెట్టిన ఉద్దేశము కాలక్రమమున మారిపోయి, చివరకు నాగులచవితి ఒక భక్తి పండుగగ మారిపోయినది. భక్తిగ మారిపోయిన నాగుల చవితి పండుగ దాదాపు రెండు లేక మూడువందల సంవత్సరముల క్రితముదేనని అంతకుముందు లేదని తెలియవలెను.

శంకరుడు గరళమను విషమునే మ్రింగి అత్యంత ప్రమాదకరమైన నాగరాజు (కింగ్‌కోబ్ర)నే మెడలో వేసుకొన్నాడు. విష్ణువుకు పాన్పుగ విష్ణునాగు ఉండెడిదట. ఇట్లు ఏనాడో దేవతల వద్దనున్న పాములను పూజించడము కొరకు నాగులచవితినుంచుకొన్నారు. మనుషులకు అలాగైనా పాముల మీద భక్తి ఉందా అని చూస్తే అది కూడ లేదు. **రాతిపాములను పూజించేవారు నిజపాములను రాళ్ళతో కర్రలతో కొట్టి చంపుచున్నారు.** నాగుపామును పూజిస్తే అవి అర్థము చేసుకోగలవు. అలాగే వాటిని ప్రేమగా చూచుకొంటే కూడ అర్థము చేసుకోగలవు. అందరికి తెలియని విషయమేమంటే పాములు కుక్కకంటే ఎక్కువ విశ్వాసముగల ప్రాణులు. పాములను ప్రేమిస్తే మన కోసము ప్రాణమునైనా ఇస్తాయి, ద్వేషిస్తే ప్రాణమునే తీస్తాయి. తనను ప్రేమించే వ్యక్తి పొరపాటుగ పాముమీద కూర్చొన్నపుడు బరువుకు చనిపోయిన పాములున్నాయి కానీ కరిచిన పాములులేవు. అంత విశ్వాసమున్న నాగుపామును, కనిపిస్తూనే చంపడము పొరపాటు కాదా! **నాగులచవితి రోజు భక్తితో పుట్టలో పాలు పోసి వచ్చుట అందరికీ ఆనవాయితి. కానీ కనిపిస్తే చంపడము కూడ ఆనవాయితీగా ఉండడము మంచిదా?** ఎండలో చంటిబిడ్డకు కూడ ప్రేమతో పడగ నీడను పట్టేపాములను మనమే శత్రువులుగా చేసుకొంటున్నాము. పేరుకు మాత్రము రాతిపాముల దగ్గర నాగులచవితిని చేసుకొంటున్నాము. కానీ బ్రతికిన పాముల పట్ల భక్తినిగానీ, ప్రేమనుగానీ, దయను గానీ చూపడములేదు.

నాగుపాములు మనిషికి ఎప్పటికి శత్రువులుకావు. మనిషే వాటిని శత్రువులుగా చేసుకొంటున్నాడు. ఊరకున్న కోడెనాగును రెచ్చగొట్టి ఇబ్బంది పెట్టినా, త్రాచుపాముకు తోడుగానున్న కోడెనాగును చంపినా పాములు పగపట్టి మనుషులను చంపగలవు. వాటిని ఇబ్బంది పెట్టి ప్రాణాపాయము కలుగ చేసినపుడే అటువంటి నిర్ణయములు పాములు తీసుకొంటాయి. ఇప్పటికైనా నాగులచవితిని చేయువారు పాములపట్ల కొద్దిగ అయిన ప్రేమను చూపండి. వాటికి కోపము వచ్చునట్లు చేసి కరిపించుకొని ప్రాణముల మీదికి తెచ్చుకొన్నవారు, పూర్వము పెద్దలు చెప్పిన వైద్యమును వాడుకోండి. అప్పుడైన పాము ఆకారములోనున్న రావి ఆకే ప్రాణమును కాపాడుచున్నదని తెలియండి. పాము పగ పండ్రెండు సంవత్సరములు ఉంటుంది. కానీ పాముప్రేమ నూరు సంవత్సరములు ఉంటుంది. అందువలన ఎటుచూచిన పాము బయటి సమాజమునకు సంబంధించినదేనని, జ్యోతిష్యశాస్త్రము ప్రకారము సమాజమునకు సంబంధించిన తిథి చవితి కావున, నాగులకు చవితిని అంటించి నాగులచవితి అన్నారు.